క్లుప్తంగా

సత్యహరిశ్చంద్ర నాటక పోటీల్లో జిల్లా కళాకారుడు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన సీనియర్ నాటకంగ కళాకారుడు వి.నారాయణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో శని, ఆదివారాల్లో జరిగిన సత్యహరిశ్చంద్ర నాటక పద్య గానం పోటీల్లో పాల్గొన్నారు. పద్యాలు గానం చేసి అలరించారు. ఆయనకు స్పెషల్ జ్యూరీ, మెమొంటో, ప్రశంసాపత్రం అందజేశారు.

చేపపిల్లల విడుదల

నవాబుపేట: ప్రభుత్వం ఉచితంగా అందించిన చేపపిల్లలను సోమవారం మత్స్యసంఘం సభ్యులు చెరువుల్లో వదిలిపెట్టారు. మండల కేంద్రంలోని రెండు చెరువులు, 4 కుంటలలో రూ.లక్షన్నర విలువైన చేపపిల్లలను వదిలినట్లు తెలిపారు. అదేవిధంగా దయాపంతులపల్లి, కొండాపూర్, హజిలాపూర్ గ్రామాల్లోనూ కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు ఆనంద్, భాస్కర్, శివ, మణివర్మ, చిర్ప నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు గోవుల తరలింపు

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామికి భక్తులు కానుకలుగా సమర్పించిన గోవులను సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నదర్పల్లిలోని శ్రీలక్ష్మి గోశాలకు అధికారుల ఆటోలో తరలించారు. ఈసందర్భంగా ఆలయ ఈఓ మధునేశ్వర్‌రెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గోవుల సంరక్షణ కోసం గోశాలకు తరలించినట్లు వివరించారు. ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన



పాలమూరు: భారతదేశ పౌరసత్వానికి ఉదయనిధి స్టాలిన్ అనర్హుడని, దేశ బహిష్కరణ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి అన్నారు. వేల సంవత్సరాల సనాతన ధర్మాన్ని కించపరుస్తూ ఆయన మాట్లాడటం సరికాదన్నారు. పాలమూరు బీజేపీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ చౌరస్తాలో ఉదయనిధి దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు పడకుల బాలరాజు, ఎగ్గని నర్సింహులు, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

మహమ్మదాబాద్: బైకు అదుపుతప్పి ఇద్దరు గాయపడిన ఘటన మహమ్మదాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే దేశాయిపల్లికి చెందిన రాములు, వెంకటయ్య సోమవారం సాయంత్రం మహబూబ్‌నగర్ వైపు ఓ వ్యక్తి అంత్యక్రియలకు బైక్‌పై బయలుదేరారు. ఈక్రమంలో మహమ్మదాబాద్ దగ్గర బైక్ అదుపుతప్పడంతో కిందపడి గాయాలపాలయ్యారు. దీంతో వారిని మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కొనసాగుతున్న దీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తమను వెంటనే రెగ్యులరైజ్ డిమాండ్ చేస్తూ సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన దీక్షలు సోమవారం కొనసాగాయి. నాయకులు శ్రీనివాస్, కృష్ణారెడ్డి, ఎండీ విక్రమ్, హర్షకుమార్, విష్ణు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవుమృతి

బాలానగర్: చిన్నరేవల్లిలో సోమవారం గ్రామానికి చెందిన రైతు చంద్రకళ తమ పశువులను మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైర్ తేలి ఉండడంతో ఓ ఆవు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో రూ.90 వేల నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయింది. ఆమెను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు, సర్పంచ్ లక్ష్మి కోరారు.

కళాశాల భవనం పూర్తిచేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల భవనం త్వరగా పూర్తిచేయాలని, పనులు నిలిచి పోవడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. తమ కార్యాలయంలో సోమవారం సమావేశంలో మాట్లాడారు. అధికారులు స్పందించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. మహేష్, కరుణాకర్, శివప్రసాద్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో యువకుల ప్రతిభ

బాలానగర్: ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో చిన్నరేవల్లి యువకులు సత్తా చాటారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి బహుమతిని గెలుపొందగా సంగారెడ్డి జిల్లాకు చెందిన జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జట్లు ఈ నెల 23న సద్గురు ఆదియోగి ఆధ్వర్యంలో కోయంబత్తూర్‌లో జాతీయస్థాయిలో ఆడాల్సి ఉంటుందని వారు వివరించారు. ఈ సందర్భంగా యువకులను పలువురు అభినందించారు.



నిండుకుండల్లా చెరువులు

- కొట్టుకుపోయిన రహదారులు
- నిలిచిపోయిన రాకపోకలు



వాగులో కొట్టుకుపోయిన మేడిగడ్డ తండా రహదారి

బాలానగర్: మండలపరిధిలో ఆదివారం రాత్రి నుంచి సుమారు రెండు, మూడు గంటల పాటు కురిసిన వర్షాలతో పలు గ్రామాలల్లో చెరువులు, కుంటలను నిండు కుండలను తలపిస్తున్నాయి. కాగా పలు గ్రామాలకు వచ్చే రోడ్లు, నాలాలు తెగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా మోతిఘణాపూర్ బీటీ రోడ్డుపై నీరు చేరడంతో ఉదయం నుంచి 6 గంటల పాటు రాకపోకలు నిలిపివేశారు. మోతీఘణాపూర్ నుంచి మేడిగడ్డ తండాకు వెళ్లే రహదారిపై నాలా తెగి కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మోతీగణాపూర్ నుంచి గంగదారిపల్లి బీటీరోడ్డుపై నీరు చేరడంతో కొన్ని గంటల పాటు రాకపోకలు నిలిచాయి.

గండేడ్: ఇటీవలి వర్షాలతో మండలంలో ఉన్న అన్ని చెరువులు దాదాపుగా పూర్తి సామర్థ్యంతో నిండాయి. వెన్నాచేడ్ పెద్ద చెరువు సోమవారం నుంచి మత్తడి దుంకుతోంది. సర్పంచ్ పుల్లారెడ్డి అలుగు వద్దకు వెళ్లి గంగా పూజ చేసి అనంతరం చెరువు దగ్గర బతుకమ్మ వద్ద, కట్టమీద ఉన్న మైసమ్మ వద్ద పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ గోపాల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నయ్య పాల్గొన్నారు.

జడ్చర్ల: మండలంలోని కోడ్గల్ వద్ద ఆదివారం దుందుభీ వాగు పరువళ్లు తొక్కింది. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద వాగులోకి చేరడంతో నిండుగా పారింది. మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో గల చెరువులు, కుంటలలోకి నీరు చేరింది. దీంతో సమీప బోర్లలో నీటి మట్టం పెరిగే అవకాశం ఏర్పడిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



కోడ్గల్ వద్ద పారుతున్న దుందుభీ వాగు



వెన్నాచేడ్ పెద్ద చెరువువద్ద పూజలు చేస్తున్న సర్పంచ్

కురుస్తున్న కలెక్టరేట్



కలెక్టరేట్‌భవనం పై భాగం నుంచి కారుతున్న నీళ్లతో తడిగా మారిన ఫ్లోర్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కొత్త కలెక్టర్ భవనం ఆదివారం రాత్రి కురిసిన వానకు ముందు భాగంలో కురుస్తోంది. సోమవారం ప్రజావాణికి వచ్చిన వారు భవనం ముందు భాగంలో నీళ్లు కురువడం చూసి ఆశ్చర్యపోయారు. నెలక్రితం ఇలాంటి పరిస్థితే నెలకొనగా అధివారులు మరమ్మతు చేయించారు. అయినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. భవనం రెండు వైపులా కురుస్తోంది. కాగా నాసిరకంగా పనులు చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి.

రెగ్యులర్ చేయాలని నిరసన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచింగ్ సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ పీయూ ముఖద్వారం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యూనివర్సిటీలో పనిచేస్తున్న అధ్యాపకులను ప్రభుత్వం మర్చిపోయిందని అన్నారు. భూమయ్య, విజయ్‌భాస్కర్, గాలెన్న, అర్జున్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



కొకుంట్లలోట్రోఫీ అందుకుంటున్న విజేతలు



మహమ్మదాబాద్‌లో..

మహమ్మదాబాద్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని వారికి ఎంతో భవిష్యత్తు ఉన్నదని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైమాట్లాడారు. అండర్ 17 బాలుర విభాగంలో నంచర్ల ఉన్నత పాఠశాల ప్రథమ, మహమ్మదాబాద్ విద్యార్థులు ద్వితీయస్థానంలో, అండర్ 14 బాలుర విభాగంలో మహమ్మదాబాద్ ప్రథమ, నంచర్ల ద్వితీయ స్థానాలు సాధించాయి. అదేవిధంగా బాలికల విభాగంలో అండర్ 17లో నంచర్ల గురుకుల ప్రథమ, ద్వితీయ స్థానంలో జూలపల్లి, అండర్14 లో నంచర్ల గురుకుల ప్రథమ, కేజీబీవీ ద్వితీయస్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా జట్లకు మెమొంటోలను అందించారు. కార్యక్రమంలో రాజేశ్వర్, హెచ్ఎం జైపాల్‌రెడ్డి, బాల్‌రాజ్, విజయానంద్‌రెడ్డి, పీడీలు అంజిలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలస్థాయి పోటీలు

జడ్చర్ల టౌన్: మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు పీడీలు రాంకల్యాణ్, శారద తెలియజేశారు. బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలబాలికలకు వేరు వేరుగా పోటీలు ఉంటాయన్నారు. అర్బన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని వివరించారు.

గండేడ్: వెన్నాచేడ్ మాడల్ స్కూల్‌లో మంగళవారం కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కొండల్‌రావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 పోటీలు ఉంటాయన్నారు. ప్రారంభోత్సవానికి మండలాధ్యక్షురాలు మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ఎంపీపీ ఈశ్వరయ్య వస్తారని వివరించారు.

దేవరకద్ర రూరల్: కొకుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా కొకుంట్ల పాఠశాల నిలిచింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. జెడ్పీటీసీ అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ సుజాత, మండల నాయకులు పాల్గొన్నారు.

కందూర్‌లో భక్తుల రద్దీ



అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ ఏర్పడింది. చివరి శ్రావణ సోమవారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద హైదరాబాద్‌కు చెందిన శ్రీధర్‌కుమార్, నందముల సాయి భక్తులకు అన్నదానం చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత



అడ్డాకుల: చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి బాధితుడికి అందజేసినట్లు మూసాపేట ఎస్ఐ కె.శ్రీనివాసులు సోమవారం తెలిపారు. నిజాలాపూర్‌కి చెందిన సీబీ.రమేష్ సెల్‌ఫోన్ ఇటీవల చోరీకి గురైందని దీంతో మూసాపేట ఠాణాలో బాధితుడు ఫిర్యాదు చేశారని వివరించారు. ఫోన్‌ను గుర్తించామని వివరించారు.

వాడ్యాల్‌లో బోనాలు

మిడ్జిల్: వాడ్యాల్‌లో సోమవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎద్దుల బండ్లను, ట్రాక్టర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రదక్షిణలు చేశారు. మహిళలు బోనాలతో వెళ్లి దేవతలకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బస్సులో ప్రయాణిస్తూ గుండెపోటుతో మహిళ మృతి

రాజాపూర్: బస్సులో ప్రయాణిస్తూ ఓ మహిళ గుండెపోటుతో మరణించిన ఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. జడ్చర్లకు చెందిన సురమోని చంద్రమ్మ (70) తిమ్మాజీపేట్ మండలం బావాజీపల్లెలో తన చెల్లెలి ఆరోగ్యం బాగాలేకపోవడంతో పరామర్శించడానికి వెళ్లింది. తిరిగి హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుల దగ్గరకు వెళ్లేందుకు జడ్చర్ల నుంచి వనపర్తి డిపో బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో బస్సు సీటులో కూర్చున్న చంద్రమ్మ రాజాపూర్ వద్ద అందరూ చూస్తుండగానే గుండెపోటుకు గురై కిందపడి ప్రాణాలు కోల్పోయినట్లు తోటి ప్రయాణికులు తెలిపారు. అంబులెన్స్‌లో మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుమారులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని తీసుకువెళ్లారు.

అంగన్‌వాడీల ధర్నా



జడ్చర్లలో మాట్లాడుతున్న సత్తయ్య



అడ్డాకులలో..

భూత్పూర్: ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు సత్వరంగా పరిష్కరించాలని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ సాదిక్ అన్నారు. సోమవారం తెలంగాణ అంగన్ వాడీ టీచర్స్,హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన నిరవధిక సమ్మెకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. మాజీ అధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, జిల్లా నాయకులు గోవర్ధన్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు, కొండయ్య ఫసియోద్దీన్, రాజేందర్ గౌడ్, అంగన్‌వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు పుష్పలత, గౌసియా బేగం పాల్గొన్నారు.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు కిల్లె గోపాల్, కురుమూర్తి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మంత్రులకు వినతిపత్రం

బాలానగర్: అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో మంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాస్ గౌడ్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు స్పందిస్తూ పనులు చేసుకుంటూ వినతులు ఇస్తే బాగుంటుందని.. నిరసనలు, ధర్నాలు సరికాదని సూచించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దీప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య సోమవారం చేపట్టిన దీక్ష శిబిరంలో మాట్లాడారు. అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి ప్రభావతి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి జరిగిన నేషనల్ లెవల్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఆయా విభాగాల్లో నలుగురు విద్యార్థులు బంగారు, ఒక రజత పతకం, 5మంది విద్యార్థులు కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను సోమవారం జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో అభినందించారు.

మోసపూరిత మెసేజ్‌లు నమ్మవద్దు



రాజాపూర్: సైబర్‌నేరాలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయని, మోసపూరిత మెసేజ్‌లు వస్తే నమ్మవద్దని రాజాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఖానాపూర్‌లో పోలీసుకళాజాతా నిర్వహించారు. వివిధ అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ యాదమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ అమరవీరుల దినోత్సవం



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ తదితరులు

జడ్చర్ల టౌన్: అటవీ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కొద్దిసేపు మౌనంపాటించి అమరవీరుల ఆత్మలకు శాంతికలగాలని కోరుకున్నారు. ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ, వృక్షశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాసులు, గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌పై విసుగుతో కాంగ్రెస్‌లోకి..



పార్టీలో చేరిన వారితో అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్ఎస్ పార్టీపై విసుగు చెంది ప్రజలు కాంగ్రెస్‌కి వస్తున్నారని టీపీసీసీ సెక్రెటరీ జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మొత్కులకుంట తండాకు చెందిన వార్డు సభ్యులతో పాటు పలువురు ఆయన సమక్షంలో పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ, రూ. ఐదు వందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తుందని అన్నారు. నాయకులు రమేష్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

వేములలో కొండచిలువ పట్టివేత



కొండ చిలువను పట్టిన గణేష్‌నాయుడు

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామంలో కొండచిలువ సంచారం ఆందోళన కలిగించింది. గ్రామానికి సమీపంలో కుర్వ బుడ్డన్న వ్యవసాయ పొలం వద్ద సోమవారం మధ్యాహ్నం గొర్రెలను మేపుతున్నారు. సమీపంలో ఉన్న కొండచిలువ గొర్రెల మందలోకి వచ్చింది. దీంతో గుర్తించి గొర్రెలను దూరంగా తరలించారు. వెంటనే గ్రామానికి చెందిన గణేష్‌నాయుడికి సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి కొండచిలువను పట్టుకున్నారు. అది సుమారు 8 ఫీట్ల పొడవు ఉన్నట్లు గణేష్ తెలిపారు. దానిని మహబూబ్‌నగర్ రూరల్ మండలం గాజులపేట అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు పేర్కొన్నారు. కాగా గురువారమే వేముల సమీపంలో వరి చేనులోకి వచ్చిన కొండచిలువను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేయగా నాలుగు రోజుల వ్యవధిలో మరో కొండచిలువ కనిపించడంతో గొర్రెల కాపరులు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు



మద్దిగట్లలో వీధుల్లో కోలాటాలు, అడుగుల భజనతో శ్రీకృష్ణుడి ఊరేగింపు

భూత్పూర్ : మండలంలోని మద్దిగట్ల, అన్నాసాగర్ గ్రామాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మద్దిగట్లలో ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞానవేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, హైదరాబాద్ శాఖ త్రైత సిద్ధాంతం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు సాగాయి. టీపీసీసీ సంయుక్త కార్యదర్శి కాటం ప్రదీప్ కుమార్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండ ప్రశాంత్‌రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ సాధిక్ పాల్గొని పూజలు చేశారు. వేడుకల్లో భాగంగా వనపర్తి జిల్లా నాగరంకు శివాంజనేయ అడుగుల భజన మండలి ఆధ్వర్యంలో భజన, అదేవిధంగా మహిళలు కోలాటాలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. నాగ్యానాయక్, చింటు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నవీన్ గౌడ్, మండల మాజీ అధ్యక్షుడు వెంకట్‌నర్సింహారెడ్డి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయంలో పూజలు



మూసాపేటలో రామస్వామి గుట్టపై ఆలయం



వరద పాయసం పోస్తున్న భక్తులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై ఆలయం గుప్త నిధుల వేటలో ధ్వంసమవడంతో గ్రామస్తులు ఆలయాభివృద్ధికి నడుం బిగించారు. దుండగులు చేసిన తవ్వకాలను పూడ్చి వేసి ఆలయంలోని విగ్రహాలను శుద్ధి చేశారు. చివరి శ్రావణ సోమవారం కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం సమీపంలో వరద పాయసం పోశారు. అన్నదానం చేశారు. మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, విశ్వేశ్వర్, కొండయ్య, జంగం మంధు, యాదయ్య శెట్టి, శ్రీనివాస్ శెట్టి, నగేష్, సుధాకర్, కృష్ణ, సతీష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రావణ మాస పూజలు

దేవరకద్ర రూరల్: శ్రావణమాసం చివరి సోమవారం పురస్కరించుకుని కొకుంట్ల, పుట్టపల్లి శివాలయాల్లో ప్రత్యేకపూజాలు నిర్వహించారు. పూజారి మఠం సురేష్ శివలింగం ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం వీరన్నపేటలోని శ్రీనీలకంఠస్వామి ఆలయంలో శ్రావణ మాసం పూజలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా నిత్య పూజలు, మంగళహారతి, సాయంత్రం బిందెసేవ (అష్టోతర శతకుంభ క్షీరాభిషేకం) నిర్వహించారు. మంగళవారం స్వామివారి పల్లకీసేవ నిర్వహించనున్నారు.



పుట్టపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



జిల్లాకేంద్రంలో కలశాల ఊరేగింపు

ఉపాధ్యాయులకు సన్మానం



చంద్రకిరణ్‌ను సన్మానిస్తున్న వీసీ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీకి చెందిన చంద్రకిరణ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమఅధ్యాపకుడిగా అవార్డును బహుకరించిన నేపథ్యంలో పీయూలో సోమవారం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మాడ్రన్ హై స్కూల్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు టీచర్ కవిత, హిందీ టీచర్ శిరీషలను సన్మానించారు. హెచ్ఎం దత్తు, పీఈటీ విలియం తదితరులు పాల్గొన్నారు.